వీస్తూ ఉంటే ఆకులు ఊగిపోతాయి, చెట్లు ఊగిపోతాయి, నడిచివెళుతూ ఉంటే మనం కూడా ఊగిపోతాము కాని కొండలు ఊగవు. నీ విశ్వాసం కొండలాగ ఉండాలి. పునాది లేకుండా ఇల్లు కడితే ఎలా ఉంటుంది. పునాది గట్టిగా ఉండాలి. అలాగే ఈశ్వరుడి మీద నీకు ఉన్న విశ్వాసం బలంగా ఉండాలి. పునాదులు లేని కొంపలు ఎలా ఉంటాయో విశ్వాసం లేని సాధన అలాగే ఉంటుంది. అందుచేత ఎటుగాలి వీస్తే అటు ఎగిరిపోకుండా దృఢమైన విశ్వాసం కలిగి ఉండాలి.

నాకోసం జీవించేవాడు, నన్ను తెలుసుకోవటం కోసం సర్వస్వం విడిచిపెట్టినవాడు, అన్ని భోగాలు ఇంద్రియాలకు అందుబాటులో ఉన్నా భోగకాంక్ష లేనివాడు నాకు నిజమైన భక్తుడు. రామకృష్ణ పరమహంసగారు ఏమని చెప్పారు అంటే ఒక చెట్టు మీద పక్షులు ఉన్నాయి అనుకోండి ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి డబ్బా వాయిస్తే ఆ పక్షులు అన్నీ ఎగిరివెళ్ళిపోతాయి. అలానే మీరు దేవుని నామం శ్రద్ధగా చేస్తూ ఉంటే పూర్వజన్మలను బట్టి అలవాటు ప్రకారం వాసనలు వస్తూ ఉంటాయిగాని అవి వచ్చి వెనక్కి వెళ్ళిపోతాయి. పూర్వజన్మలనుండి వచ్చే వాసనలు అనే పాములు బుసలు కొడుతూ వచ్చి మీమీద పడతాయి. మీరు మాత్రం నామం విడిచిపెట్టకండి. నామం జాగ్రత్తగా, శ్రద్ధగా చేస్తూ ఉంటే ఆ బుసలు అణిగిపోయి అవి ప్రక్కకు వెళ్ళిపోతూ ఉంటాయి, అలా వెళ్ళిపోగా వెళ్ళిపోగా వాటికి మేత తగ్గిపోయి చివరకు నశిస్తాయి. ఈ లాభాలు నష్టాలు, జయాలు అపజయాలు, గౌరవాలు అగౌరవాలు, బహుమానాలు అవమానాలు ఇవన్నీ లోకానికి సంబంధించినవి, రోడ్డు మీద దుమ్ములాంటివి. మనం దుమ్ము కోసం తిరుగుతున్నాము, జీవితం పొడగునా ప్రయత్నం చేసి దుమ్మును పోగుచేసు కొంటున్నాము. మనం బియ్యపు గింజలు సంపాదించటానికి ప్రయత్నం చేయటంలేదు, ఆ పైన ఉన్న పొట్టును సంపాదించటానికి ప్రయత్నం చేస్తున్నాము.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 07-03-2010, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణుడు అర్జునుడికి చెప్పిన ఉపదేశం భగవద్గీత. అంటే అక్కడ అర్జునుడిని వంపుగా పెట్టుకొని మొత్తం మానవజాతికంతా ఆయన బోధించాడు, ఆయన బోధ జీవకోటికంతా వర్తిస్తుంది. ఇక్కడ అర్జునుడి స్థాయిలోకి రాకుండా భగవంతుడు ఆయన స్థాయిలోనే ఉండి బోధ చెప్పకొంటూ వెళ్ళిపోయాడు. కృష్ణుడు భగవంతుడు అయి చెప్పాడు కాబట్టి దానిని భగవద్గీత అన్నారు. కృష్ణుడు ఆయన చివరిరోజులలో ఉద్దవుడికి బోధ చేసాడు. అక్కడ పరమాత్మ ఉద్దవుడి స్థాయిలోకి దిగిపోయి, ఏరకంగా చెపితే ఉద్దవుడికి అర్థమవుతుందో ఆ రకంగా చెప్పాడు. దానిని ఉద్దవగీత అంటారు. అర్జునుడిది కర్మమార్గం ఆయనకు తగినట్లుగా అక్కడ చెప్పాడు. ఉద్దవుడిది భక్తిమార్గం, అందుచేత ఆయన మార్గంలో ఆయనను ప్రోత్సహిస్తూ

అది చెప్పాడు. భగవద్గీతకంటే ఉద్ధవగీత అర్థం చేసుకోవటానికి తేలికగా ఉంటుంది. నువ్వు యుద్ధంలో నుండి పారిపోవద్దు, కర్మ చెయ్యి అని అర్జునుడికి భగవద్గీతలో చెప్పాడు. ఉద్ధవగీతలో అయితే నువ్వు ఈ జనం మధ్యలో ఉండవద్దు, నీకు ఇక్కడ తగిన సత్సంగంలేదు, వీరితో స్నేహం వలన నీ భక్తి పాడవుతుంది అందుచేత నువ్వు బదరికాశ్రమానికి వెళ్ళిపో అని ఉద్ధవుడికి పరమాత్మ చెప్పాడు.

మనం ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి, అతిగా తినకూడదు. ఆహారం విషయంలో కనుక జాగ్రత్తగా లేకపోతే మన ఇంద్రియాల మీద, మనస్సు మీద మనకు ఆధిపత్యం రాదు. మనకు ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఎంతోకొంత ఉందికాని ఆత్మజ్ఞాన సముపార్జనకు సరిపడలేదు. అది కావాలంటే ఆహారనియమం ఉండాలి. ఆహారం విషయంలో బహుజాగ్రత్తగా ఉంటే ఆధ్యాత్మికంగా 100కి 50 మార్కులు వచ్చేసినట్లే. మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకోవాలి. శరీరాన్ని మనస్సును మనం చేసే సాధనకు ఉపయోగించుకోవాలి. ఎవరైనా మిమ్మల్ని పొగిడితే సంతోషిస్తారు, విమర్శిస్తే దుఃఖపడతారు. ఇవన్నీ జీవలక్షణాలు. సమాజంలో ద్వంద్వాలు ఉంటాయి, వీటి మధ్యలో ఉంటూ ఈ గౌరవాలకు, అగౌరవాలకు, పొగడ్తలకు, నిందలకు దూరంగా మీరు లోపల ఉండగలుగు తున్నారు అనుకోండి మీలో ప్రత్యేకత ఉన్నట్లు గుర్తు. అది మీరు ఈ జన్మలో అయినా సాధించి ఉండాలి, పూర్వజన్మలో అయినా సాధించి ఉండాలి. మీరు పూర్వజన్మలో చేసిన సాధన కూడా ఈ జన్మకు వస్తుంది. మీరు చేసిన సాధన గాని, చేసిన మంచిగాని వూరికే పోదు అని పరమాత్మ చెప్పాడు. కామక్రోధాలు ఎక్కువగా ఉంటే అవి మనలను సాధన చెయ్యనివ్వవు. ఇంట్లో అయినా, సమాజంలో అయినా మన డ్యూటీ మనం చెయ్యాలి కాని అక్కడ మమకారం పెట్టుకోకూడదు. దేహము, గేహము (గృహం) ఈ రెండింటి మీద మనకు మమకారం ఎక్కువగా ఉంటుంది. ఆ మమకారాన్ని తగ్గించుకొంటూ రావాలి. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకోవాలి, ఇతరులకు సహాయం చేయగలిగిన శక్తి ఉంటే సహాయం చేయాలి. మీ తలంపులు, ఆలోచనలు అన్నీ భగవంతుడు చుట్టూ తిరుగుతూ ఉండాలి. అవసరంలేని పనులలోనికి వెళ్ళకండి. ఎవరైనా వచ్చి మిమ్మల్ని సలహా అడిగితే మీకు చేతనైతే చెప్పవచ్చు. వారు విన్నారని, వినలేదని మీకు అనవసరం. మీకు ప్రారబ్ధం ఎలా ఉందో వారికి ప్రారబ్ధం ఉంటుంది కదా. మీ సలహాకు, ఆ దేహప్రారబ్ధానికి సంబంధం లేదు అనుకోండి మీ సలహా వారు వినరు. చెవిటి వాడికింద, మూగవాడికింద ఉండకండి. ఎవరైనా మంచిమాట చెపుతూ ఉంటే వినండి, చెవిటి వాడికింద ఉండవద్దు. ఎవరైనా మిమ్మల్ని సలహా అడిగితే మీకు తెలుసుంటే చెప్పండి. నోరుమూసుకొని కూర్చోవద్దు అంటే మూగవాడిగా ఉండవద్దు. సాధ్యమైనంతవరకు భక్తులతో సహవాసం చెయ్యండి. లౌకికులతో సహవాసం మంచిదికాదు.

మీకు వచ్చే తలంపులు మంచివి కాదు అనుకోండి, మీ అలవాట్లు మంచివికాదు

అనుకోండి కంగారుపడవద్దు. భగవంతుడి నామాన్ని స్మరించుకొంటూ, ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ, ఆయన పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే ఆయన దయ వలన మనస్సులో ఉన్న రోగాలు అన్నీ పోతాయి. సంసారం కూడా ఒక రోగం, ఇది మాయలోనుండి వచ్చింది, ఒకసారి మాయలో పడ్డాము అంటే ఇటువంటి శరీరాలు కోట్లాది శరీరాలు మోయవలసిందే, ఏ శరీరం వస్తుందో మనం చెప్పలేము. మన తలంపును బట్టి, ఆలోచనను బట్టి జన్మరాదు, మనం చేసిన కర్మనుబట్టి జన్మ వస్తుంది. భగవంతుడి దయ సంపాదిస్తే గాని ఈ మాయలో నుండి మనం బయటపడలేము.

ఆనకట్ట కట్టకముందు సముద్రంలోనికి నీరు ఎలా వెళ్లిపోతుందో అలాగ జపధ్యానములు చేయకపోతే నీ మనస్సు వేగంగా విషయాల మీదకు వెళ్లిపోతుంది. జపధ్యానములు ఆనకట్ట వంటివి. విషయాలమీదకు వెళ్లిపోతున్న నీ మనస్సును ఆపి భగవంతుడి వైపుకి మళ్లిస్తాయి. మనస్సుకు లోచూపును కలుగజేస్తాయి. జ్ఞానికూడా ప్రారబ్ధాన్ని అనుభవించవలసిందే అని శాస్త్రం చెప్పింది. మనస్సు బాహ్యముఖం అయినవాడికి ప్రారబ్ధం మాట నిజమే, అంతర్ముఖం అయిన వాడికి ప్రారబ్ధం ఏమిటి అన్నారు భగవాన్. దేహం ఉన్నవాడికి, లోకం ఉన్నవాడికి ప్రారబ్ధంకాని, దేహం ఉన్నా దేహవాసన లేనివాడికి, లోకం ఉన్నా లోకవాసన లేనివాడికి ప్రారబ్ధం ఏముంది అన్నారు. ఎందుకు వచ్చినమాటలండీ, మీ శరీర ప్రారబ్ధాన్నిబట్టి మీకు కేన్సర్ వచ్చింది, దానిని మీరు అనుభవిస్తున్నారు కదా, అదీ ప్రారబ్ధమే కదా అని అన్నాడు. రమణమహర్షి ప్రారబ్ధం అనుభవిస్తున్నాడు అని చూసేవాడు అంటున్నాడు, నేను అనుకోవటం లేదు కదా. అలా అనుకొనేవాడు ఇక్కడలేడు కదా, ఇంక ప్రారబ్ధం ఏమిటి. వాడికి ధనం ఉండవచ్చు, అధికారం ఉండవచ్చు, ఎన్ని ఉన్నా వాడి మనస్సు బాహ్యముఖం అవుతూ ఉంటే ప్రారబ్ధం అనుభవించవలసిందే. జపధ్యానములు చేసి, విచారణ చేసి ఎవడైతే తన మనస్సును హృదయగతం చేసాడో ఇంక వాడికి ప్రారబ్ధం ఎక్కడ ఉంది. నేను ప్రారబ్ధం అనుభవిస్తున్నాను అని ఎవరు చెపుతున్నారు, నీ మనస్సే చెపుతోంది, అదే లేనప్పుడు ఇంక ప్రారబ్ధం ఏముంది.

భగవంతుడు బత్తాకాయలాంటివాడు. బత్తాయిలో తొక్క, తొనలు, లోపల రసం ఉంటుంది. అలాగే భగవంతుడికి సృష్టికి సంబంధించిన ఎడ్మినిస్ట్రేషన్ అంతా ఉంటుంది, బత్తాకాయలో ఉన్న రసం జ్ఞాని అయితే మొత్తం బత్తాకాయ అంతా కలిసి భగవంతుడు. పరమాత్మను తెలుసుకొన్నవాడు పరమాత్మ అయిపోతాడు అని ఒక స్వాములవారు చెప్పారు. పరమాత్మను తెలుసుకొన్నవాడు పరమాత్మ అయిపోడు, పరమాత్మ స్వరూపాన్ని పొందుతాడు, అంటే మోక్షం పొందుతాడు. బత్తాకాయ అయిపోడు, బత్తాయిలో ఉన్న రసం అవుతాడు ఇంక తొక్కల గొడవవాడికి అక్కరలేదు. మనం పిండి ఎలా రుబ్బుతామో అలాగ భగవంతుడు చెప్పిన మాటలను మీ మనస్సులో రుబ్బుకోండి. ఆయన రూపాన్ని ధ్యానించుకొంటూ ఆయన నామాన్ని స్మరించుకొంటూ ఉంటే ఇంక మీ మనస్సు ఎక్కడికి వెళుతుంది. అది బాహ్యానికి

వెళ్ళదు. మీ దేహయాత్రకు సరిపడ పనులు చేసకొని మీ మనస్సును, ఇంద్రియాలను నా చుట్టూ తిప్పకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. నన్ను ఆశ్రయించండి అని పరమాత్మ చెపుతున్నాడు. మనం డబ్బును ఆశ్రయిస్తాము, బంధువులను ఆశ్రయిస్తాము, లోకాన్ని ఆశ్రయిస్తాము కాని భగవంతుడిని ఆశ్రయించేవాడు ఎవడూ లేడు. బ్యాంకులో ఇంత డబ్బు ఉంది, మాకు స్నేహితులు ఉన్నారు, మాకు వచ్చే ఆదాయం ఇంత ఉంది, మేము ముసలివారము అయితే చూసేవారు ఉన్నారు అని ఇటువంటి గొడవలను ఆశ్రయిస్తున్నాము కాని భగవంతుడిని ఉపాసన చేస్తూ, భగవంతుడే మనకు దిక్కు అనే భావన మనకు రావటంలేదు. అందుచేతనే నన్ను ఆశ్రయించండి అని భగవంతుడు చెపుతున్నాడు. వాడి గొప్పలకోసం, గౌరవాలకోసం డబ్బును ఖర్చుపెడుతున్నాడు కాని భగవంతుడి దయను సంపాదించటంకోసం ఎవడూ డబ్బు ఖర్చుపెట్టడు. ఎందుచేతనంటే భగవంతుడు ఉన్నాడనే నమ్మకం మనకు లేదు. మనం ప్రాపంచికవిషయాలను సపోర్టుగా పెట్టుకొంటున్నాము గాని భగవంతుడిని సపోర్టుగా పెట్టుకోవటంలేదు.

విషయాలు మిమ్మల్ని బాధపెడుతున్నాయి అనుకోండి, బాధపెడుతున్నాయి, బాధపెడుతున్నాయి అనుకోకూడదు. భగవంతుడి యందు భక్తి పెంచుకొంటే ఇవి తగ్గిపోతాయి, మీకు ఎవరైతే బాగా ఇష్టమో వారు మొట్టికాయలు మొట్టకపోతే మీకు వైరాగ్యం రాదు. మీరు ఎవరికోసం బతుకుతున్నారో వారు పట్టుకొని మిమ్మల్ని కొట్టేస్తారు అనుకోండి, అప్పుడు మీకు ఎంతోకొంత వైరాగ్యం వస్తుంది. మనం విషయాలను ఎంజాయ్ చేయటంవలన అవి మనలో వాసనలకింద పడతాయి. కొన్నివేల జన్మలనుండి ఈ వాసనలు వస్తున్నాయి. ఈ వాసనలను పోగొట్టుకోవటం చాలా కష్టం. మనం జ్ఞానం గురించి విన్నా లోపల వాసనలు ఉన్నప్పుడు అది నిలబడదు. పూర్తిగా వాసనాక్షయం అయితేగాని మనకు జ్ఞానం కలుగదు. ఈలోపుగా మీరు మంచి విషయాలు వింటే చాలాబాగున్నాయి, శాంతిగా ఉంది అని మీరు అనుకొంటారు. కాని ఆ సుఖాన్ని, శాంతిని లోపల ఉన్న వాసన నిలబడనివ్వదు. ఆవాసన వేరుతో సహా నశించాలి. దానికి మీరు ప్రయత్నం చేయాలి, గురువు దయ ఉండాలి, ఈశ్వర కటాక్షం ఉండాలి. ఇన్ని రకాలుగా కలిసివస్తేగాని వాసన నశించదు. ఈ శరీరం ఎవరిది అంటే నాది అంటాము అంటే అక్కడ నేను శరీరంతో తాదాత్మ్యం పొందుతోంది. ఇక్కడ అనేక శరీరాలు ఉన్నాయి, అందరి శరీరాలు నావి అనుకోవటం లేదు. ఫలానా శరీరమే నాది అనుకొంటున్నాను. ఆ భావన పూర్తిగా నశించాలి. అంటే వ్యక్తిభావన పోవాలి. తపస్సు అంటే ఎండింపచేయటం. మనస్సును, ఇంద్రియాలను నూటికి నూరుపాళ్ళు ఎవడైతే స్వాధీనం చేసుకొన్నాడో వాడి తపస్సు ఫలించినట్లు అవుతుంది. మనం ఏదైనా ఒక విషయం గురించి ఆలోచించేటప్పడు ఉద్రేకంగా ఆలోచిస్తే మనం నష్టపోతాము, ప్రశాంతంగా ఆలోచించినప్పడే మంచి భావాలు వస్తాయి. పూర్వం అనేకమంది జ్ఞాన తపస్సులు చేసి, నా పాదాలయందు

భక్తి కలిగి ఉండి, నాకు ఇష్టమైన పనులు చేస్తూ, నేను వద్దని చెప్పిన పనులు మానేసి, వారి మనోదేహములను నా చుట్టూ తిప్పకొంటూ, విచారణ చేసి, ధ్యానంచేసి నా అనుగ్రహాన్ని సంపాదించి పవిత్రులు అయ్యి నా స్వరూపాన్ని పొందారు. అర్జునా నువ్వు కూడా అలా నడవటానికి ప్రయత్నం చెయ్యి, పెద్దలు నడిచిన మార్గంలో ప్రయాణించి నువ్వు కూడా తరించు అని చెపుతున్నాడు.

దేవుడు ఉన్నాడా లేడా అనే మాట వదిలివేయండి. మీరు ఉన్నారు కదా. నేను లేను అని ఎవడూ అనటం లేదుకదా. నేను ఉన్నాను అనటంలో ఎవరికీ అనుమానం లేదు. మీరు బయట గొడవలతో కలవవద్దు. మీకు వంద రూపాయలు ఉన్నాయి అనుకోండి. అస్తమాను అదే లెక్కపెట్టుకొంటూ ఉంటే నూట ఒకటి అవుతుందా, ఎప్పడూ వందే ఉంటుంది. మీకు పొలం ఉంది కాని మీరు పొలం కాదు. మీకు డబ్బు ఉంది కాని మీరు డబ్బు కాదు. మీరు మీరే. ఇది గుర్తు పెట్టుకోండి. నేను ఇలా ఉన్నాను, అలా ఉన్నాను అని మీ వృత్తితోగాని, మీ దేహంతోగాని దేనితోను తాదాత్మ్యం లేకుండా ఉండండి. అప్పడు ఈ నేనుకు మేత తగ్గిపోయి నెమ్మదిగా పల్చబడి, అంతర్ముఖమయ్యి, అది నశిస్తుంది. మనకి జీవితంలో అదృష్టం వస్తూ ఉంటుంది వెళ్ళిపోతుంది, దురదృష్టం వస్తూ ఉంటుంది వెళ్ళిపోతుంది. మీ దేహప్రారబ్దాన్నిబట్టి రోజులు వెళ్ళిపోతాయి మీరు మాత్రం దేనితోను కలవవద్దు. అలా ఉన్నాను అనుకోవద్దు, ఇలా ఉన్నాను అనుకోవద్దు. మీరు మీరుగా ఉండండి, మీకు మోక్షం తొందరగా వస్తుంది. ముందు జాగ్రత్త పడలేకపోయాము. మన చెయ్యి దాటిపోయింది, ఇప్పడు ఏమి చెయ్యగలము అంటారు. ముందు జాగ్రత్త పడితే మటుకు నీ చేతిలో ఏముంది, నువ్వు బొమ్మవు మాత్రమే, అంతా భగవంతుడి చేతిలో ఉంది, ఆయన సంకల్పం ప్రకారమే అంతా నడుస్తుంది.

నీ చేతిలో ఉన్న పనిని నువ్వు హృదయపూర్వకంగా చేయాలి, అది కర్మ. భగవంతుడు వద్దని చెప్పినది వికర్మ. ఏ పని చేస్తే నీకు దుఃఖం వస్తుందో, భవిష్యత్‌లో అశాంతి వస్తుందో ఆ పని చెయ్యవద్దని భగవంతుడు చెప్పాడు. అంటే నువ్వు చేయకూడనిపని అది వికర్మ. బుద్ధిమంతుడు, వివేకవంతుడు అయినవాడు వికర్మ మాట వదిలేయండి అది ఎలాగు చేయకూడని పనే, కర్మలో అకర్మను చూస్తాడు అంటే వాడు చేసినా చేయనివాడితో సమానము. భగవంతుడు పని చేస్తున్నాడు, ఆయన ఎలా పని చేస్తున్నాడో ముందు మనకు అర్థమవ్వాలి. ఆయనకు కర్మఫలం పట్ల ఆసక్తిలేదు, కోరికలేదు కాని పనిచేస్తున్నాడు మీరు కూడా అలా పనిచేస్తే కర్మ మిమ్మల్ని చుట్టుకోదు. అసలు మీకు సబ్జక్టు అర్థమవుతూ ఉంటే మీరు చనిపోయాక స్వర్గం కాదు, ఈ భూమి మీదే స్వర్గం అనుభవిస్తారు. అంటే స్వర్గంలో ఏ సుఖాలు అయితే ఉన్నాయో అంతకంటే ఉత్తమ సుఖాన్ని ఇక్కడ పొందుతారు. మీరు రాగద్వేషాలు లేకుండా పని చేస్తారు అనుకోండి అప్పడు కర్మ మిమ్మల్ని బంధించదు. కోరికతో చేసిన కర్మ బంధిస్తుంది. కర్మలో అకర్మను చూడటం అంటే వ్యక్తిభావన లేకుండా, దేహభావన

లేకుండా పనిచేస్తే అది అకర్మ అవుతుంది. అంటే కర్తలేనికర్మ అవుతుంది. నేను చేస్తున్నాను అనే భావన లేకుండా బ్రహ్మభావనతో పనిచేస్తే నువ్వు చేసినా చెయ్యనివాడితో సమానమవుతావు.

మీరు ఏదైనా మంచిపని చేసారు అనుకోండి. ఏమండీ మీరు మంచిపని చేసారు అని ఎవరైనా అంటే మీకు సంతోషం వస్తుంది. అంటే అక్కడ మీరు కర్తతో చేసినట్లు. మీరు చేసిన పని ఎవరికీ ఉపయోగపడదు, ఏవో గొప్పలకోసం పనులు చేసారు అంటే వెంటనే మీకు దుఃఖం వస్తుంది అంటే అక్కడ కర్తతో చేసినట్లు, అంటే లోపల నేను అనే భావన ఉంది కదా. నేను అనే భావన లేకుండా పనిచేస్తే నువ్వు కర్మలో అకర్మను చూస్తావు, అప్పుడు కర్మ నిన్ను బంధించదు. మీరు మంచిపని చేసినంత మాత్రంచేత అందరూ మిమ్మల్ని గౌరవిస్తారు అనుకోవద్దు, దూషించే వారు కూడా ఉన్నారు. ఆ గొడవలు వద్దు. అక్కడ అవసరం కాబట్టి నువ్వు పని చేసావు అంతవరకే. కృష్ణుడు గీతలో ఏమన్నాడు అంటే నేను పని చేసి సంపాదించేది లేదు, ఒకవేళ పనిమానివేస్తే వచ్చే నష్టం లేదు అన్నాడు. ఎందుచేతనంటే ఆయన పూర్ణపురుషుడు. జీవుడికి లాభం నష్టం ఉంటాయికాని దేవుడికి లాభంలేదు, నష్టం లేదు, వ్యక్తిభావన లేకుండా, మమకారం లేకుండా సమానబుద్ధితో పనిచేస్తూ ఉంటే ఆ పని మిమ్మల్ని బంధించదు. లోపల వ్యక్తిభావన పెట్టుకొని పనిచేస్తూ ఉంటే తప్పనిసరిగా ఆ కర్మ మిమ్మల్ని చుట్టుకొంటుంది. ఆ కర్మ ఫలితం ఎప్పుడో ఒకప్పుడు అనుభవంలోనికి రావలసిందే. నువ్వు ఏమనుకొంటున్నావు అంటే నేను పని చేస్తున్నాను, దేవుడు పని చేయటంలేదు అనుకొంటున్నావు. ఎందుచేతనంటే మనిషి చేసే పని కళ్ళకు కనిపిస్తుంది, దేవుడు చేసేపని కళ్ళకు కనబడదు. ఎందుచేతనంటే అక్కడ వ్యక్తిభావనలేదు. నీ సంకల్పంతోటి, తలంపుతోటి, నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా ఒకోసారి పని జరిగిపోతుంది. అది ఎవరు చేసారు అంటే అది దేవుడి చేసిన పని, అది అకర్మ, అకర్మలో కర్మను చూడటం నేర్చుకొంటే ఇంక నీకు దుఃఖం ఏమిటి అంటున్నారు మధ్వాచార్యులు. స్వప్నంలో ఒకోసారి మనం చాలా కష్టపడి పనిచేస్తున్నట్లు అనిపిస్తుంది. అప్పుడు నిజంగా నీ శరీరంగాని, ఇంద్రియాలుగాని పనిచేస్తున్నాయా, పనిచేయటంలేదు. కాని స్వప్నంలో నేను కష్టపడిపోతున్నాను అని నీవు అనుకొంటున్నావు కదా. అక్కడ నీ దేహంమటుకు ఏమీ కష్టపడటంలేదు. అది అకర్మలో కర్మను చూడటం. నువ్వు ఏమీ పని చెయ్యకపోయినా పనిచేస్తున్నాను అనుకొంటున్నావు కాబట్టి అది అకర్మలో కర్మను చూడటం. ఈ జీవితం కూడా అటువంటిదే.

మీకు చెడ్డస్వప్నం వచ్చింది అనుకోండి. మెలకువ వచ్చాక ఆ చెడ్డ స్వప్నం గురించి మీరు ఏమైనా బాధపడతారా, బాధపడరు. ఎందుచేతనంటే అది అబద్దం అని తెలిసిపోయింది. స్వప్నం అబద్దం అని జాగ్రదవస్థలోనికి వచ్చాక మనకు తెలుస్తుంది. స్వప్నావస్థలో నుండి జాగ్రదవస్థలోనికి ఎలా మేల్కొన్నామో అలాగే జాద్రవస్థలోనుండి ఆత్మజ్ఞానంలోనికి మేల్కొంటే

ఈ జాగ్రదవస్థ కూడా స్వప్నం అని తెలిసిపోతుంది. మీరు బ్రహ్మంలో మేల్కొన్నప్పడు అంటే చూచేవాడు, చూడబడేది, చూడటం అనేది ఈ త్రిపుటి పోయిన స్థితిలో ఈ జాగ్రదవస్థ కూడా స్వప్నం అని తెలిసిపోతుంది. అది అబద్ధం అని తెలిసాక అది అదృష్టం అయితే ఏముంది, దురదృష్టం అయితే ఏముంది. జ్ఞానం కావాలి అనుకొనేవారికి వివేకం ఉండాలి, వైరాగ్యం ఉండాలి, విచక్షణ ఉండాలి, ఈ జన్మలోనే పొందాలి లేకపోతే ఆ ప్రయత్నంలో చనిపోదాం అనే దృఢనిశ్చయం ఉండాలి. ఇవి అన్నీ ఉంటేగాని మనం ఆత్మజ్ఞానాన్ని పొందలేము. మనం అనాత్మను ఆత్మగా చూస్తున్నాము. అనాత్మ మీద కాంక్ష పెంచుకొంటున్నాము. జ్ఞానం కావాలి అనుకొనేవాడికి ఇది తగ్గాలి. ఆధ్యాత్మిక విషయాలే కాదు భౌతిక విషయాలు కూడా ఎవరు ఏది చెపితే అది నిజం అని నమ్ముతాము. చాలామంది అలా మోసం చేస్తారు. జీవితంలో మోసపోవటమే మన పని. మనకు తెలివిలేనప్పడు ఏమి చేస్తాము అంతేమరి. చేలో నీరు బయటకు పోయింది అని బాధపడుతూ కూర్చోవటంకంటే కొత్తనీరు పెట్టుకోవటం మంచిది. ఇప్పడు మనకు 70 ఏళ్ళు వచ్చేసాయి. ఇప్పటివరకు ఏమీ సాధన చేయలేదు అని బెంగపెట్టుకోవటంకంటే ఈ రోజునుంచి అయినా సాధన మొదలుపెట్టటం మంచిది. బెంగపెట్టుకోవటం వలన ఏమి వస్తుంది. మనం చనిపోవటానికి ఇంకా కొంతటైము ఉంది కదా. ఇప్పటినుండి సాధన చేస్తే ఆ టైము కలిసివస్తుంది. గతించిన విషయాలను గురించి బెంగపెట్టుకోవటంకంటే రాబోయే కాలాన్ని ఉపయోగించుకో అని పరమాత్మ గీతలో చెప్పాడు.

ఈ శరీరాలు పుట్టటం స్వప్నం, ఈ శరీరాలు చనిపోవటం స్వప్నం, ఈ జన్మలు స్వప్నం. మన కుటుంబ సభ్యులను, మన స్నేహితులను, బంధువులను మనస్సే కల్పించింది. ఈ దేహాన్ని, ప్రపంచాన్ని మనస్సే కల్పించింది. ఈ బంధువులు, స్నేహితులు, కుటుంబసభ్యులు అన్నీ కూడా మనస్సు ఎంత నిజమో వారు కూడా అంతే నిజం. మనస్సు అనే గెడపదాటితే ఈ సృష్టిని దాటినట్లే. నా మాయను జయించటం చాలా కష్టం. మీరు సాధన చేసినా నా దయ లేకుండా నా మాయను జయించలేరు అని పరమాత్మ గీతలో చెప్పాడు. మీరు సాధన బాగా చేస్తున్నారు అనుకోండి. మీకు ఏదైనా ఆకర్షణీయమైన సంఘటన చూపించాడు అనుకోండి సడన్‌గా మీ మనస్సు వెళ్ళి అక్కడ పడిపోతుంది, ఫెయిల్ అయిపోతారు. వందఏళ్ళనుండి కష్టపడి చేసిన సాధన అంతా బూడిద అయిపోతుంది. నా మాయ అంత బలీయమైనది. మీరు ఒడ్డుకు వచ్చాక ఒడ్డుకు వచ్చాము అనుకోండి కాని మధ్యలో అనుకోవద్దు. మీరు సాధన చెయ్యండి, ప్రయత్నం చెయ్యండి, మంచి చెయ్యండి కాని మీరు పరమస్థితిని పొందేటప్పడు నా దయలేకుండా పొందుదామని మీరు అనుకోవద్దు, అది మీవల్ల కాదు, నువ్వెంత నీ సాధన ఎంత నా దయ లేకుండా నువ్వు పొందేది ఏమీ లేదు అంటున్నాడు.

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మే | 18 | శంకర జయంతి, జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha

## సద్గురు శ్రీనాన్నగారి ప్రవచనముల నుండి "అమృత గుళికలు"

1. ఆత్మజ్ఞానం లేని జీవితం శవాలంకరణ వంటిది.
2. చైతన్యము, జ్ఞానము, ఈశ్వరుడు, ఆత్మ, అమృతస్థితి, శాంతి, గురువు, సత్యము ఇవన్నీ ఏకవస్తువే అదే అద్వయ బ్రహ్మము.
3. మన హృదయంలో ఉన్న సత్యవస్తువే నిజమైన గురువు.
4. నీవెవరివో తెలుసుకో! అదే సకల వేదాల సాధనల సారం.
5. తనను తెలియుటయే దేవుని తెలియుట.
6. ఆధ్యాత్మికతకు అర్హత సహృదయం.
7. మనోనాశమే ఆధ్యాత్మిక సాధనల పరమగమ్యం.
8. ఒక్క బ్రహ్మము (ఆత్మ) తప్ప అన్నీ మనోకల్పితాలే!
9. మనస్సు నశిస్తే చైతన్యం తానుగా అనుభవంలోకి వస్తుంది.
10. సృష్టిలో ఏదైనా పనికిరాని వస్తువు అంటూ ఉంటే అది అహంకారము (లేక) అహంభావన మాత్రమే!
11. అహంకారం అణిగే కొలది ఈశ్వరుని సహాయం అందుతుంది.
12. నీలోని లోపాలను భూతద్దంలో చూచుకో! ఇతరులలో కనబడే దోషాలు మన దోషాలే!
13. జగత్తుకు సూర్యుడు ఎట్లో, దేహానికి హృదయం అట్లు.
14. ఎవరి మనస్సును వారు సంస్కరించుకొనుటయే నిజమైన విప్లవం.
15. సత్యాన్వేషకుడే సాధకుడు.
16. మన అశాంతికి, దుఃఖమునకు కారణం మనలోపల అహంభావన రూపంలో ఉంది.
17. నీవు ఏ వృత్తిలో ఉన్నా అహంవృత్తిలో లేకుండ జీవించు.
18. మోక్షం అంటే మన నిజమైన ఇంటికి మనం వెళ్లడం.
19. తేలిపోతున్న మనస్సును హృదయంలోకి ముంచడానికి సహకరించే వాడే గురువు.
20. ఎంత చిన్న పని అయినా చిత్తశుద్ధితో, ప్రేమతో చెయ్యాలి.

**చావలి సూర్యనారాయణ మూర్తి, టీచర్, అమలాపురం**

# దైవ విశ్వాసం సంరక్షిస్తుంది - అనుమానం ముంచేస్తుంది

ఎవరు సత్య శోధనలో ఉన్నారో వారు ధన్యులు. ఎవరు దృశ్యమంతా నిజమనుకొని దైవం లేడు అనుకొంటాడో వారు భాగ్యహీనులు. నిజభక్తుని ప్రార్థన ఇలా ఉంటుంది "తండ్రీ! ధనం మీద, కామం మీద ఆసక్తి లేదు నా ప్రారబ్దంలో ఏది జరగాలో అది జరుగుతుంది. జన్మ జన్మలకు నీ పాదాల మీద నిశ్చల భక్తి కలిగి ఉండేలా చూడు" అని. మరి భగవంతుని హామీ ఇలా ఉంటుంది "నన్ను స్మరించు - నిన్ను స్మరిస్తాను. నన్ను విశ్వసించు - నిన్ను ఉద్ధరిస్తాను. నాపై భారం ఉంచు - రక్షకుడుగా ఉంటాను. శరణాగతి చెందు - నేనే చూచుకొంటాను. నేను ఎక్కడో లేను - నీ హృదయంలో ఉన్నాను" అని. త్యాగరాజు "ఉపచారం చేసేవారు వాకిటలోనే ఉన్నారు అని మరువకుమా!" అన్నారు. దైవ విశ్వాసం కొండలను కదిలిస్తుంది. విశ్వాసానికి మించిన సంపద మరియొకటి ఈ సృష్టిలో లేదు. ఒకడు సముద్రాన్ని లంఘించాలని ఒక స్వామిని ఆశ్రయిస్తే ఒక చీటిలో ఒక మంత్రాన్ని వ్రాసి మొలకు కట్టి దీనిపై విశ్వాసంతో లంఘించు అనగా ఆతను అవలీలగా సముద్రాన్ని దాటుతూ ఆశ్చర్యంగా ఈ చీటీలో ఏముంది అని అనుమానంగా చూడగా "శ్రీరామ" అని ఉండటం చూచి ఓసి ఈ మాటేనా అని అవిశ్వాసంతో ఉన్న క్షణంలో సముద్రంలో మునిగిపోయాడు. భగవంతుణ్ణి స్మరించకుండా ఉండలేనప్పడు ఆయన గురించి ఆలోచించకుండా ఉండలేనప్పడు ఆయనే మనలను ప్రేమిస్తున్నాడని గ్రహించాలి. భగవదనుగ్రహానికి అదే కొలబద్ద, ప్రహ్లాదుడు దానికి ఉదాహరణ. శ్రీ నాన్నగారు "ఈశ్వరుని పాదాలు చూడగానే ఆనందపరవశుడు అవుతాడు భాగవతుడు" అన్నారు. అన్ని విషయాల్లోనూ ఎప్పడూ భగవంతుణ్ణి చూస్తే ఇక పాపము అనేది కనబడదు. అనుమానం పెట్టుకొంటే అన్నిచోట్లా పాపమే కనిపిస్తుంది. దైవ విశ్వాసం ఉంటే మనస్సు, మంచినే చూస్తుంది. శ్రీరామకృష్ణులు దేహాన్ని చాలించాక వారి భక్తులు వారి పటాన్ని సజీవమూర్తిగా భావించేవారు. రాత్రి 12 గంటలకు ఉక్కబోస్తే రాత్రి అంతా విసినకర్రతో విసిరి స్వామి నిద్రపోయాడని నిశ్శబ్ధంగా ఉండటం చూచి ఒకరు అది ఎలా సాధ్యం అని అంటే "ప్రేమకు ఆ శక్తి ఉంది" అన్నారు. చనిపోయేవాడు గురువు కాదనే విశ్వాసం ఉండాలి. మంచి వారికి ఈ ప్రపంచం అంతా మంచే. భక్తుడికి గురువు భగవంతుడిలా కనిపిస్తాడు. అదే ప్రకృతి మనుషులకు మనిషిలా కనిపిస్తాడు. జీవితం పట్ల మనకున్న వైఖరే దానికి కొలబద్ద. ప్రతీవారికీ స్వంతకొలబద్ధలు ఉంటాయి. మన మనస్సులో ఏది ప్రతిఫలిస్తే దాన్నే బయట చూస్తాము అన్నిటా దైవాన్ని దర్శించినవాడే ధన్యుడు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం